హైస్కూల్ ప్లస్‌లో పోస్టుల భర్తీ

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లా పరిషత్ యాజమాన్యంలోని ఆరు హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఐదు పోస్టులను భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 37 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అర్హత గల ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా నియమించనున్నట్లు తెలిపారు. వజ్రపుకొత్తూరు హైస్కూల్‌లో భౌతికశాస్త్రం, జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం... బ్రాహ్మణతర్లా, హరిపురం హైస్కూళ్లలో జంతుశాస్త్రం సబ్జెక్టులను బోధించేందుకు అర్హత గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. ఈనెల 24న నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తు చేసుకుని ఒరిజినల్ సర్టిఫికేట్లు, సర్వీస్ రిజిస్టర్లతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

కూలి గిట్టని 'ఉపాధి'

- రెండు పూటలా పని చేసినా దక్కని కూలి
- రోజుకు కనీసం రూ.120 రాని పరిస్థితి
- కొన్ని ప్రాంతాల్లో మూడు వారాలుగా జమ కాని డబ్బులు

పొందూరు మండలం కోటిపల్లికి చెందిన పిన్నింటి కావ్య మూడు వారాలుగా ఉపాధి పనికి వెళ్లారు. ఒక వారానికి సంబంధించి ఆరు రోజులకు రూ.700 డబ్బులు మాత్రమే ఖాతాలో జమ అయ్యాయి. మండుటెండలో రెండు పూటలా పనిచేస్తే ఆమెకు రోజుకి దక్కింది రూ.116.66 మాత్రమే. ఈ డబ్బులతో ఎలా బతికేదని ఆమె నిట్టూరుస్తున్నారు. వేసవి అలవెన్స్ అమల్లో ఉంటే మే నెలకు సంబంధించి 30 శాతం అదనంగా అంటే రూ.150పైన భత్యం లభించేది. కేంద్ర ప్రభుత్వం దాన్ని ఎత్తేయడంతో కూలి డబ్బులు బాగా తగ్గిపోయాయి.

ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కొందరు కూలీలకు మూడు వారాలు గడుస్తున్నా డబ్బులు రాని పరిస్థితి నెలకొంది. ఇదే మండలం రాపాక చెందిన కొంచాడ లక్ష్మి మూడు వారాలుగా పనిచేస్తున్నా ఇప్పటికీ డబ్బులు జమ కాలేదు. క్వారీ పనులకైనా వెళ్దామన్నా అక్కడ పనులు ఆపేయడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు చవిచూస్తున్నారు.

ఇదీ ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీల పరిస్థితి. కూలీలకు సకాలంలో డబ్బులు రాకపోవడం, చాలీచాలని కూలి లభించడం వీరిద్దరికే పరిమితం కాలేదు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. పనిచేసినా డబ్బులు అందక కొందరు, చేసిన పనికి తగ్గట్టు డబ్బులు రాక కొందరు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పొందూరు

జిల్లాలో ప్రస్తుతం 920 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం 2.72 లక్షల మందికి పైగా పనుల్లోకి వస్తున్నారు. ప్రతి ఏడాది మేలో గరిష్టంగా పనుల్లోకి వచ్చే పరిస్థితి ఉండడంతో పనులు అడిగే వారి సంఖ్య మరింత పెరగనుంది. కూలీలకు ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు వేసవి భృతి ఇచ్చే పరిస్థితి ఉండగా, ఈ సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఈ సీజన్‌లో ఎండ వేడిమితో భూమి బాగా ఎండిపోయి గట్టిబారడంతో మట్టి పనులు చేసేందుకు అనువుగా ఉండదు. ఇతర కాలాల్లో మాదిరిగా ఎక్కువ సమయం పనులు చేయడమూ కష్టంగా ఉంటుంది. ఎండ వేడిమి, వడగాడ్పుల ప్రభావంతో ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనిచేయించేవారు. ఈ కష్టానికి, శ్రమకు అనుగుణంగా చేసిన పనికి అదనంగా భృతి చెల్లించేవారు. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మేలో చెరో 30 శాతం, జూన్‌లో 20 శాతం అదనంగా భృతి చెల్లించేవారు. ప్రస్తుతం వేసవి అలవెన్స్‌ను ఆపేయడంతో కూలీలకు వచ్చే డబ్బులపై తీవ్ర ప్రభావం పడుతోంది.

అదనపు సౌకర్యాలను నిలిపేసిన కేంద్రం

ఉపాధి కూలీలకు 2021-22 ఆర్థిక సంవత్సరం వరకు అదనపు సౌకర్యాలు దక్కేవి. ఉపాధి హామీ చట్టం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) సాఫ్ట్‌వేర్‌ను వినియోగించేది.

దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉండాలన్న సాకుతో కేంద్ర ప్రభుత్వం 2022-23 సంవత్సరం నుంచి ఎన్ఐసి (నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్)ని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో అప్పటివరకు కూలీలకు అందుతున్న అదనపు సౌకర్యాలకు కోత పడింది. గతంలో కూలీలకు మంచినీళ్లకు రూ.5, పార లేక తట్టకు రూ.5.50 ఇచ్చేది. దీంతో మొత్తం వారంలో అదనంగా రూ.10.50 వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో వారి ఆదాయంపై ప్రభావం పడింది.

దక్కని కనీస కూలి డబ్బులు

ఉపాధి హామీ చట్టంలో కనీస కూలి డబ్బులు దక్కిన పరిస్థితి ఉండడం లేదు. గత ఐదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో కనీస కూలి రూ.245 ఉండగా, జిల్లాలో రూ.190 నుంచి రూ.200 మాత్రమే దక్కింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కనీస కూలి రూ.257 ఉండగా, జిల్లాలో గరిష్టంగా రూ.240 లోపే కూలి దక్కింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూలిపై కేంద్రం కేవలం రూ.15 మాత్రమే పెంచింది. కనీస కూలి రూ.272 ఉండగా, మండుటెండలో రెండు పూటలా పనిచేసినా రూ.210 మించి దక్కడం లేదు. నిత్యావసర వస్తువుల ధరలు ఒకవైపు పెరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం కనీస కూలి రూ.10 నుంచి రూ.15 పెంచుతూ వారిపై మొసలి కన్నీరు కారుస్తోంది.

సివిల్స్‌లో సిక్కోలు యువతి సత్తా

ఒప్పంగికి చెందిన కళ్యాణికి 285వ ర్యాంకు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సిక్కోలు కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. యుపిఎస్‌సి మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో సిక్కోలు యువతి సత్తా చాటింది. శ్రీకాకుళం రూరల్ మండలం ఒప్పంగికి చెందిన చల్లా కళ్యాణి 285వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. చిన్ననాటి నుంచి పేదరికం, ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా పట్టుదలతో చదివి అత్యున్నత స్థాయికి ఎదిగారు. ఈమె తండ్రి అసిరినాయుడు మేస్త్రిగా పనిచేస్తున్నారు. తల్లి సత్యవతి గృహిణి. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా, కళ్యాణి రెండో కుమార్తె. పెద్ద కుమార్తె సరళకు వివాహమైంది. చిన్న కుమార్తె రమ ఎమ్మెస్సీ చదివి ఉన్నతోద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నారు. 2021లో ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో సబ్ ట్రెజరీ అధికారిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె గుంటూరులో శిక్షణ పొందుతున్నారు. శిక్షణ పొందుతూనే మరోవైపు సివిల్స్‌కు సాధన సాగించి విజయం సాధించారు. కుమార్తె సివిల్స్‌లో ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తల్లిదండ్రులకు బంధువులు, స్నేహితులు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులపై విచారణ

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని తాడివలస, కోటిపల్లి పంచాయతీ కార్యదర్శులపై ఆయా పంచాయతీల సర్పంచ్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డిఎల్‌పిఒ ఆర్.గోపీబాల మంగళవారం విచారణ చేపట్టారు. తాడివలస కార్యదర్శి బి.వెంకటరావు విధులకు సక్రమంగా రావడం లేదని, సమయపాలన పాటించడం లేదంటూ సర్పంచ్ తమ్మినేని మణెమ్మ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. కోటిపల్లి పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఇంటి పన్నులు వసూలు చేసి పంచాయతీ ఖాతాకు జమ చేయలేదని సర్పంచ్ గురుగుబెల్లి సుధారాణి ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని పలువురు అధికారులు, వాలంటీర్లను విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు డిఎల్‌పిఒ తెలిపారు. ఆయనతో పాటు మండల పరిషత్ కార్యాలయ ఇఒ మురళి తదితరులున్నారు.

కోటిపల్లిలో విచారణ చేస్తున్న డిఎల్‌పిఒ గోపీబాల

బావాజీపేటలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

ఉపాధికి కేంద్రం తూట్లు

25న కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిరావాలి : వ్య.కా.స

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, నాయకులు భవిరి కృష్ణమూర్తి విమర్శించారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని అలికాం, కరిమిల్లిపేట, బావాజీపేటలో ఉపాధి పని ప్రదేశాలను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. అందులో భాగంగానే బడ్జెట్‌లో నిధుల కేటాయింపును తగ్గిస్తోందని చెప్పారు. ఆన్‌లైన్ మస్టరు విధానంతో కూలీల్లో గందరగోళ పరిస్థితి తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయ పనుల్లేని సమయంలో ఉపాధి హామీ చట్టం కూలీలను ఆదుకుంటోందన్నారు. వేసవిలో ఏ పనులు దొరకని సమయంలో వ్యవసాయ కూలీలు మొదలుకొని డిగ్రీ చదువుకున్న యువత వరకు ఉపాధి హామీ పనులకు వెళ్తూ ఉపాధి పొందుతున్నారని చెప్పారు. ఈ చట్టం వల్లే పేదలకు పట్టెడన్నం దొరుకుతుందన్నారు. ఇటువంటి చట్టాన్ని ఎత్తివేసి ప్రజల పొట్ట కొట్టాలని బిజెపి ప్రభుత్వం చూస్తోందన్నారు.

రెండు పూటల పనిని రద్దు చేయాలని, వేసవి భృతి 40 శాతం, వంద రోజులు పూర్తి చేసిన కుటుంబాలకు పని కల్పించాలన్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలైన టెంటు, మంచినీళ్లు, మెడికల్ కిట్లు ఉంచాలని డిమాండ్ చేశారు. మంచినీళ్లకు రూ.పది, గునపం, పారకు సాన పెట్టడానికి రూ.50 చెలించాలని, తట్టకు రూ.20 ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ మస్టర్ విధానం రద్దు చేసి పాత పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి చట్టానికి మరిన్ని నిధులు ఇచ్చి బలోపేతం చేయాలని, పట్టణ ప్రాంత పేదలకు, విలీన పంచాయతీల్లోని పేదలకు ఉపాధి పథకాన్ని వర్తింపజేయాలన్నారు. ఈ చట్టాన్ని కాపాడుకునేందుకు ఈనెల 25వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

వెండితెర వెలుగు శరత్‌బాబు

ప్రజాశక్తి - ఆమదాలవలస, శ్రీకాకుళం అర్బన్

వెండితెరపై వెలుగు వెలిగిన సినీ దిగ్గజం శరత్‌బాబు అని రాష్ట్ర సాంస్కృతిక శాఖ బోర్డు డైరెక్టర్ జె.జె మోహనరావు అన్నారు. పట్టణంలోని శ్రీదేవి థియేటర్ ఆవరణలో మంగళవారం శరత్‌బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆయన మృతికి సంతాప సూచకంగా శ్రీదేవి థియేటర్‌లో మార్నింగ్ షోను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి శరత్‌బాబు అని కొనియాడారు. కళా రంగానికే కాకుండా సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని గుర్తుచేశారు. పట్టణంలో అయ్యప్ప దేవాలయం, రామలింగేశ్వర ఆలయం, పాలపోలమ్మ తల్లి వంటి ఆలయాలకు ఆయన ఇతోధిక సాయం చేశారని చెప్పారు. సినీ రంగంలో హీరోగా, విలన్‌గా, సహాయ నటుడిగా పాత్ర ఏదైనా అందులో ఒదిగిపోయేవారని చెప్పారు. అటువంటి వ్యక్తి ఇక లేడన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. కార్యక్రమంలో సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుసుమంచి శాంప్రసాదరావు, యర్నాగుల ప్రభాకరరావు, జలుమూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శరత్‌బాబు మృతి తీరనిలోటు

జిల్లాలో పుట్టి పెరిగి విలక్షణ నటుడుగా పేరు తెచ్చుకున్న శరత్‌బాబు మృతి తీరని లోటు అని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) రాష్ట్ర సమితి అధ్యక్షులు టి.ఎస్ సుకుమారన్, ప్రధాన కార్యదర్శులు కె.రాజశేఖర్, సనపల నర్సింహులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దక్షిణాది సినీ పరిశ్రమల్లో కీర్తి ప్రతిష్టలు పొందారని తెలిపారు. శరత్‌బాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శరత్‌బాబు చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ ఒకటో తేదీ వరకు షెడ్యూల్‌ను అనుసరించి ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు జరుగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సర, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 20 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలుగా గుర్తించారు. మాస్ కాపీయింగ్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో అదనంగా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. పరీక్షల పర్యవేక్షణకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్స్, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. నలుగురు సభ్యులతో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీని నియమించారు. హైపవర్ కమిటీలో కలెక్టర్, ఎస్‌పిని సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. ఈ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కలిపి 25,714 మంది విద్యార్థులు కానున్నారు. రెండు పూటలా పరీక్షల నిర్వహణ, వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, ఇతర సదుపాయాలు ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పోలీసు బందోబస్తుతో పాటు ప్రతి పరీక్షా కేంద్రంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. 24 పేజీలున్న ఆన్సర్ బుక్‌లో మాత్రమే పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఆన్సర్ బుక్ నంబరును ఒఎంఆర్ పార్ట్ 1, పార్ట్ 2 నింపాల్సి ఉంటుందని ఆర్ఐఒ ఎస్.తవిటినాయుడు తెలిపారు. పరీక్షల నిర్వహణ సమయంలో సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు.

ఆదిత్యుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామి వారికి నిర్వహించే పలు సేవల్లో పాల్గొన్న అనంతరం ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ప్రోటోకాల్ జడ్జి కె.రాణి, ఎస్‌సి, ఎస్‌టి జడ్జి ఎం.ఎస్ ఫణికుమార్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జడ్జి పి.భాస్కరరావు, ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, బిసి న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.



జ్ఞాపికను అందజేస్తున్న ఇఒ హరి సూర్యప్రకాష్

ప్రజావసరాలు తీర్చడమే లక్ష్యం

ప్రజాశక్తి - గార

క్షేత్రస్థాయిలో ప్రజావసరాలను గుర్తించి వాటిని పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆ దిశగానే నాలుగేళ్లుగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మండలంలోని పూసర్లపాడులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన శాలిహుండం-2 సచివాలయ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు పాలనా సౌలభ్యం కల్పించడమే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. గ్రామాల్లో తగాదాలకు భూ సమస్యలే ప్రధాన కారణమని, వాటిని కట్టడి చేసేందుకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ వ్యవస్థను తీసుకొచ్చి ఆటో మ్యుటేషన్‌ను అమలు చేస్తున్నామన్నారు. దీనికి తోడు సమగ్ర భూ సర్వే చేస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో ఎంపిపి గొండు రఘురాం, తహశీల్దార్ రామారావు, సర్పంచ్ అరవల కల్పన, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణ, అరవల రామకృష్ణ, యాళ్ల నారాయణ, కె.నాగభూషణ్, ముంజేటి కృష్ణ, పీస గోపి, పీస శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జాడ లేని జీడి పరిశోధనా కేంద్రం 6వ పేజీలో

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

కమీషన్ల వల్లే కరెంటు భారాలు

విద్యుత్ ఛార్జీల పెంపు, కోతలకు నిరసనగా టిడిపి ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యుత్ వ్యవస్థను అస్తవ్యస్తం చేసి కమీషన్లు, దోపిడీల వల్లే ప్రజలపై రూ.57 వేల కోట్ల విద్యుత్ భారాలను మోపిందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆరోపించారు. విద్యుత్ ఛార్జీల పెంపు, కరెంటు కోతలను నిరసిస్తూ జిల్లాలోని పలు మండలాల్లో టిడిపి ఆధ్వర్యాన సబ్ స్టేషన్ల వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగరంలోని ఎపి ఇపిడిసిఎల్ సర్కిల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో లక్ష్మీదేవి మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై పెను భారాన్ని మోపుతూ రోజుకో విధానాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ సరఫరాకు అడ్డంకులు సృష్టిస్తూ కృత్రిమ కొరత చూపి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. రూ.వేల కోట్ల ప్రజా ధనాన్ని తమ అనుచరుల కంపెనీలకు, సూట్‌కేసు కంపెనీలకు దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. 'సెకీ' ఒప్పందం ద్వారా రూ.20 వేల కోట్ల భారం విద్యుత్ వినియోగదారులపై వేస్తున్నారని తెలిపారు. 2014లో 22.5 మిలియన్ యూనిట్ల లోటుతో రాష్ట్ర ప్రస్థానం మొదలైందని, ఆనాటికి 9,529 మెగావాట్ల సామర్థ్యాన్ని టిడిపి ప్రభుత్వం 2018 నాటికి 19,080 మెగావాట్లకు పెంచిందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి మిగులు విద్యుత్ అందించామన్నారు. గత టిడిపి ప్రభుత్వం విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు అమ్మే స్థాయికి తీసుకొస్తే, వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో ఒక్క యూనిట్ అదనపు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచలేదని విమర్శించారు. దీంతో వేసవి ఆరంభం నుంచి ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలను అమలు చేస్తూ వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కరెంట్ కోతల వల్ల పరిశ్రమలకు పవర్ హాలిడే ప్రకటించిన దుస్థితి నెలకొందన్నారు. వైసిపి ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల కరెంటు లేని పరిస్థితి ఉందన్నారు. కోతలు లేని కరెంటు ఇవ్వాలని, విద్యుత్ కొనుగోలులో జరిగిన అవినీతి, ఒప్పందాల్లో అవకతవకలపై కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలన్నారు. ధర్నాలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, నాయకులు ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, కవ్వాడి సుశీల, సింతు సుధాకర్, విబూది సూరిబాబు, పి.ఎం.జె బాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

నరసన్నపేట : స్థానిక టిడిపి కార్యాలయం నుంచి హెడ్ క్వార్టర్ 33 కెవి సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గంలోని టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెక్కలి : రావివలస వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, అజయ్ కుమార్, బోయిన రమేష్, హనుమంతు రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

ఇచ్ఛాపురం : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద చేపట్టిన ధర్నాలో టిడిపి పట్టణ అధ్యక్షుడు కాళ్ల ధర్మారావు, మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, నందిక జాని, సహదేవరెడ్డి, లీలారాణి, ఎల్.పద్మనాభం, కె.జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : స్థానిక సబ్ స్టేషన్ వద్ద చేపట్టిన ఆందోళనలో టిడిపి మండల అధ్యక్షులు మద్దిల నాగేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, మాజీ ఎంపిపి శ్రీనివాసరావు, బి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండల కేంద్రంలోని 33 కెవి సబ్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్మల్లిక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT SRIKAKULAM
A.R.B.O.P: 1/2019

Between:
Behara Hari Hara --Petitioner
And:
Shriram City Union Finance Co., Ltd., and others --Respondents

NOTICE

To,
R-3 Nikkondi Rana Pratap, S/o Narayana Murty,Hindu, aged 44 years, Residing at D.No:2-10, Raja Street, Mandadsa Village and Mandalam, Srikakulam Ditrict

Please take notice that the above matter is posted to **dt:16 -06-2023** for your appearance. You are hereby directed to appear before the above Hon'ble Court on **dt:16-06-2023 at 10-30 A.M.,** either in person or through advocate without fail. Otherwise the matter will be decided in your absence. Hence this notice.

//BY ORDER//

T. KHAGENDRA NATH,
ADVOCATE FOR THE PETITIONER
SRIKAKULAM.
CELL: 9440105533

ట్రోఫీని అందజేస్తున్న గాంధీ

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాంధీ

ప్రజాశక్తి - ఆమదాలవలస

క్రీడలు శారీరిక, మానసికోల్లాసానికి దోహదపడతాయని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ సీనియర్ నాయకులు సువ్వారి గాంధీ అన్నారు. మండలంలోని చీమలవలసలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానంలో ముఖ్య అతిథిగా మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడంతో క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వీరికి తీసి భావి ప్రపంచానికి చాటి చెప్పవచ్చని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని అన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ క్రికెట్ క్రీడా పోటీల్లో 24 జట్లు పాల్గొనగా ప్రథమ బహుమతి, రాగోలు ద్వితీయ బహుమతి, చీమలవలస కాలనీ, తృతీయ బహుమతి చీమలవలస జట్లు కైవసం చేసుకున్నాయి. కైవసం చేసుకున్న జట్లకు రూ.15 వేలు, రూ.పది వేలు, రూ.5 వేలు పారితోషికంతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సనపల చెల్లంనాయుడు, పేడాడ వైకుంఠరావు, బాగాది నేతాజీ, గురుగుబెల్లి రాజశేఖర్, కనిమెట్ట మాజీ సర్పంచ్ కింతలి జగన్నాథం, సుధాకర్, రామకృష్ణ, కె.రమేష్, ఎన్.రామకృష్ణ, బి.సాయి, గురుగుబెల్లి రాజు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన నౌపడ ఎఫ్‌సిసి జట్టు

క్రికెట్ టోర్నీ విజేత నౌపడ

ప్రజాశక్తి - నౌపడ

నౌపడ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న బొంగు రాజారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో నౌపడ ఎఫ్‌సిసి జట్టు విజేతగా నిలిచింది. 6 నుంచి నిర్వహిస్తున్న ఈ టోర్నీలో 36 జట్లు పాల్గొన్నాయి. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో నౌపడ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 92 పరుగులు చేసి సున్నా పల్లి జట్టు 80 పరుగులకే కట్టడి చేశారు. విజేతలకు బొంగు రాజారెడ్డి తనయుడు హర్షవర్ధన్ రెడ్డి విజేతలకు మొదటి బహుమతి ట్రోఫీతో పాటు రూ.20 వేలు, రెండవ బహుమతి ట్రోఫీతో పాటు రూ.15వేలు అందజేశారు. మేన్ ఆఫ్ ది సిరీస్ సున్నాపల్లి జట్టు సభ్యుడు నవీన్ కు, మేన్ అఫ్ ది మ్యాచ్ నౌపడ జట్టు సభ్యుడు ముదిలి ఈశ్వరరావుకు అందజేశారు. ఎఫ్‌సిసి సభ్యులు కర్రి రాజా, అఖిల్, కర్రి శివ, గిరి, కంబాల కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

జాడ లేని జీడి పరిశోధనా కేంద్రం

ఇబ్బందులు పడుతున్న జీడి రైతులు

ప్రజాశక్తి - పలాస

ఉద్దాన ప్రాంతంలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు కలగానే మిగిలింది. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా పరిశోధన కేంద్రం ఏర్పాటుకు నోచుకోవడం లేదు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు ఓట్ల కోసం హామీలు ఇవ్వడమే తప్ప... అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోతుంది. 15 ఏళ్లుగా ఉద్దాన ప్రాంతంలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో జీడిసాగుపై జిల్లా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేవారు కరువయ్యారు. ఈ క్రమంలో పంటకు తెగుళ్లతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు ఇక్కడకు వచ్చి అవగాహన కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పలాస డివిజన్ కేంద్రంగా మారిన నేపథ్యంలో ఉద్దానంలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

జీడి తోట

పరిశోధన కేంద్రంతో రైతులకు ప్రయోజనం

జిల్లాలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. వాతావరణ పరిస్థితులను బట్టి జీడి పంటకు ఎలాంటి మందులను పిచికారీ చేయాలి, ఎక్కువ పూత రావడానికి, పిక్కలు రాలిపోకుండా ఉండడానికి ఏమి చేయాలి వంటి అంశాలపై శాస్త్రవేత్తల నుంచి సలహాలు, సూచనలు పొందేందుకు అవకాశం ఉంటుంది. పూత, చిగురు, కాపునకు వచ్చే సమయంలో పంటకు ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టాలో శాస్త్రవేత్తల నుంచి తెలుసుకోవచ్చు. దీనివల్ల అధిక దిగుబడి సాధించే వీలుంటుంది. ఏదేమైనా ప్రభుత్వాలు మారుతున్నా జీడి రైతుల కళలను సఫలం చేయడంలో విఫలం చెందుతున్నారనే చెప్పాలి.

జీడి రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు (ఫైల్)

15 ఏళ్లుగా ఎదురుచూపులు

జీడి సాగులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో 315302 ఎకరాల విస్తీర్ణంలో జీడి తోటలు ఉన్నాయి. రాష్ట్రంలో 11 జిల్లాలో ఈ పంటను అధికంగా సాగు చేస్తుండగా, ఇందులో శ్రీకాకుళం జిల్లా మూడో స్థానంలో ఉంది. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతమైన పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి మండలాల్లో జీడిని అధికంగా పండిస్తున్నారు. ఉద్దానంలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని గత 15 ఏళ్లుగా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప ఏర్పాటుకు నోచుకోవడం లేదు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దానంలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో ఈ ప్రాంత రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. కానీ, అది కార్యరూపం దాల్చలేదు.

2013లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి పలాస మండలం రామకృష్ణాపురంలో జీడి తోటలో రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. జీడి సాగులో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలు, తెగుళ్లతో నష్టపోతున్న వైనాన్ని వివరించారు. దీంతో త్వరలోనే జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తామని కిరణ్‌కుమార్ చెప్పారు. ఆ తరువాత ఆ విషయాన్ని మరిచిపోయారు. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వమూ హామీ ఇచ్చినా అమలు కాలేదు. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం సైతం అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్నారే తప్ప ఏర్పాటు చేయకపోవడంతో రైతులు పెదవి విరిచారు.

నష్టపోతున్న జీడి రైతులు

ఉద్దాన ప్రాంతాలుగా ఉన్న పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో జీడి రైతులు ఉన్నారు. జీడి సాగులో సాంకేతిక నైపుణ్యత, లోపాలను తెలిపేవారు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాణిజ్య పంటైన జీడికి తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది. చిగురు, పూత, పంట ఏపుగా పెరిగే సమయాల్లో చీడపీడలు ఆశిస్తాయి. వేసవిలో ఉదయం కురిసే పొగమంచుతో పూత మాడిపోవడం, రాలిపోవడం, జీడిపిక్కలు నల్లగా, బూజు పట్టినట్లు అయిపోతుంటాయి. ఇలాంటి సమయాల్లో ఎటువంటి మందులు చల్లాలి, ఏ విధంగా పంటను కాపాడుకోవాలో తెలియక రైతులు ఇబ్బందులు పడుతుంటారు. తెగుళ్ల నివారణకు ఎలాంటి సంరక్షణ చర్యలు చేపట్టాలి, పూత రావడానికి ఏ మందులు వినియోగించాలి వంటి అంశాలపై వారికి సరైన అవగాహన ఉండడం లేదు. దీనిపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు స్థానికంగా శాస్త్రవేత్తలు లేరు. దీంతో బాపట్ల, తదితర ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు ఇక్కడకు వచ్చి రైతులకు సూచనలు ఇస్తున్నారు. అదికూడా కేవలం ఒకట్రెండు ప్రాంతాలకే పరిమితమవుతున్నారు. నామమాత్రపు సూచనలు కావడంతో సరైన ఫలితాలు రావడం లేదని జీడి రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంతంలో జీడి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రేపు జగనన్న ఆణిముత్యాలు నగదు పురస్కారం

మాట్లాడుతున్న ఎంఇఒ రామారావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఈ నెల 25న ఉదయం 10 గంటలకు స్థానిక శారదా కళ్యాణ మండపంలో జగనన్న ఆణిముత్యాలు నగదు పురస్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంఇఒ దుప్పల రామారావు అన్నారు. స్థానిక ఎంఆర్‌సిలో ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటూ నియోజకవర్గస్థాయిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు నగదు పురస్కారాలను అందిస్తామని అన్నారు. అలాగే జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సత్కరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గస్థాయి నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశానుసారం నాడు-నేడు పనులు మంజూరైన పాఠశాలలు జూన్ నెల స్కూళ్ళ ప్రారంభానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యాసంక్షేమాధికారి, ఎపిఎం పైడి కూర్మారావు, ఎఇ రామారావు, కన్వీనర్ పేడాడ ప్రభాకరరావు, పొందూరు ఎంఇఒ పి.రామరాజు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

బెల్లుపడ సచివాలయం పరిధిలో గల 12వ వార్డ్‌లో నివసిస్తున్న నర్తు పాపమ్మ ఇటీవల అనారోగ్యంతో మతిచెందారు. ఆమె కుమార్తె నైనాల సుజాతకి చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మీ వైఎస్సార్ బీమా రూ.10వేలు అందజేశారు. మిగిలిన రూ.90వేలు నైనాల సుజాత అకౌంట్ లో జమచెయ్యడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి 12వ వార్డు ప్రతినిధి బుడుపు త్రినాథ్, సంబంధిత సచివాలయం సెక్రెటరీ బట్టి బాలకృష్ణ పాల్గొన్నారు.

నగదును అందిస్తున్న రాజ్యలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

28న మందకృష్ణ పర్యటన

ప్రజాశక్తి - పలాస

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ 28న జిల్లాలో పర్యటిస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్పిఎస్ జిల్లా కో కన్వీనరు లోపింటి తేజేశ్వరరావు తెలిపారు. మంగళవారం కాశీబుగ్గలో నియోజకవర్గం పరిధి దివ్యాంగులు, మహిళల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28వ తేదీ ఉదయం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ధర్నా, ఆర్. అండ్. బి గెస్ట్ హౌస్ వద్ద అనాథాశ్రమాన్ని సందర్శిస్తారని అన్నారు. అనంతరం 3 గంటలకు డాక్టర్ అంబేద్కర్ భవన్‌లో జిల్లా దివ్యాంగుల సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వరపు చిన్నసుబ్బారావు, ఉన్నాన అప్పలరాజులు పాల్గొన్నారు.

పనులు కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం

సమస్యలు వివరిస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి - నౌపడ

నౌపడ పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారని ఉపాధి కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్రివీధి మండపం వద్ద జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు కొల్లి ఎల్లయ్య మంగళవారం ఉపాధి కార్మికులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలు ఆయన దష్టికి తీసుకువచ్చారు. గతేడాదిలో పనిచేసిన మూడు వారాల బిల్లులు ఇప్పటి వరకు జమచేయలేదని వాపోయారు. పంచాయతీ పరిధిలోని సుమారు 400 మంది కూలీలకు పనులు కల్పించలేదన్నారు. జాబ్ కార్డు మంజూరు చేయాలంటే ఫీల్డ్ అసిస్టెంట్‌లు వందల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని, మూడు రోజుల నుంచి ధర్నా చేస్తున్నా అధికారులు స్పందించడంలేదని వాపోయారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంపై కార్మికులకు అవగాహన కల్పించారు. కూలీల సమస్యలను సబ్ కలెక్టర్ దష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకోవాలని, బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహంతి రాజు, ఉలాస దేవ, వాకాడ యర్రన్న, కర్రి సన్యాసమ్మ, తిప్పాన అప్పలరాజు పాల్గొన్నారు.

జీడిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయాలని ఎంపిటిసి సభ్యురాలు కొండప్ప సురేఖ డిమాండ్ చేశారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ జీడి పిక్కల ధరలు చూస్తుంటే రైతు కంట కన్నీళ్లు వస్తున్నాయన్నారు. 80 కిలోల బస్తాకు రూ.8 వేలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కల్పించుకొని జీడి రైతులకు మద్దతు ధర లభించేలా చొరవ చూపాలని కోరారు. వంశధార పరిధిలో పూడిక తీత పనులు చేపట్టడంలో జాప్యం వలనే శివారు భూములకు సాగునీరు అందడం లేదని మండల ప్రత్యేక అహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ వంశధార అధికారులను నిలదీశారు.

సమావేశంలో మాట్లాడుతున్న సురేఖ

పొల్లాడ సర్పంచ్ గోపి మాట్లాడుతూ కాలువలో పూడికతీత పనులు ఇప్పటికే చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు లవని, అక్టోబర్‌కైనా సాగునీరు శివారు భూములకు అందిస్తారా అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. గుత్తేదారులకు బిల్లులు చెల్లింపులో జాప్యం కారణంగా వంశధార కాలువలో పనులు చేయ డానికి ఎవరూ ముందుకు రావడం లేదని నీటిపా రుదల అధికారులు బదులిచ్చారు. దీనిపై మినిట్ తయారు చేయాలని ప్రత్యేక ఆహ్వానితులు ఉదయ్ కుమార్ ఎంపిడిఓ సిహెచ్. ఈశ్వరమ్మకు సూచించారు. గోర్జీలను రహదారులుగా మార్చడా నికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎపిఓ కేశవరావుకు సూచించారు. ఈ ఖరీఫ్‌లో వరి విత్త నాలతో పాటు గడ్డి మందు, పురుగు మందులను ఆర్‌బికె ద్వారా రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు ఎఓ కిరణ్ వాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి, వైస్ ఎంపీపీ వంక రాజు, సర్పంచ్‌లు దున్న బాలరాజు చింత హేమరావు బచ్చాల, ధర్మారావు కరుణాకర్ భాస్కరరావు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న తులసీవరప్రసాద్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మెళియాపుట్టి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాతపట్నం నియోజకవర్గ వైసిపి నాయకులు లోతుగడ్డ తులసీవరప్రసాద్ అన్నారు. మండలంలోని కేరాశింగిలో జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రేగటి కన్నయ్యస్వామి, కృష్ణారావు, వెంకటేష్, చిన్నబాబు, చిన్నారావు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలు అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్థుల్లో సృజనాత్మక విలువలు పెంపొందించుకునేందుకు వేసవి శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయని, అందువల్ల తల్లిదండ్రులు పిల్లల ఆలోచన శైలిని మార్చేందుకు వీలుగా వారిని ప్రోత్సహించాలని రచయిత చింతాడ రామారావు (సిరా) పిలుపునిచ్చారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన వేసవి శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు హరి కథలు, బుర్ర కథలు, తప్పెటగుళ్ళు, దింసా నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు భాగస్వాములు కావాలన్నారు. మేజీషియన్ ఉమామహేశ్వరరావు మేజిక్ షో చిన్నారులను ఉత్తేజ పరచింది. క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - సోంపేట

కార్మికుల ఐక్య పోరాటాలతోనే ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోగలమని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జుత్తు సింహాచలం, సంగారు లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని మామిడిపల్లి పంచాయతీలో ఉపాధి కూలీలతో మంగళవారం వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి కార్మికుల ప్రయోజనాలని దెబ్బతీస్తోందని, ఎనిమిదేళ్ల కాలంలో ఉపాధి హామీ పథకానికి కేటాయిస్తున్న నిధులు తగ్గించడం ద్వారా ఉపాధి హామీ చట్టాన్ని నీరు గార్చాలని ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలో కోట్లాదిమంది ఉపాధి హామీ కార్మికులు ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులో 480 రూపాయలు ఉంటే కేరళలో 600 రూపాయలు ఉందని మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కనీసం 200 రూపాయలు కూడా ఉపాధి హామీ కార్మికులకు ఇవ్వలేకపోవడం అత్యంత దురదష్టకమని అన్నారు. దీనికి వ్యతిరేకంగా 25వ తేదీన కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, వెంటనే ఉపాధి హామీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న చైర్మన్ గిరిబాబు

వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి - పలాస

వాలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 10, 12 వార్డ్ సచివాలయం పరిధిలో పని చేస్తున్న వాలంటీర్లును మంగళవారం ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. పోతనపల్లి హరి, ఆర్ఐ అప్పలస్వామి వార్డ్ కౌన్సిలర్‌లు, వైసిపి నాయకులు కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలాకి: వాలంటీర్ల సేవలు అమోఘమని ఎంపిడిఓ ఈశ్వరరావు కొనియాడారు. మంగళవారం ఉరజాం, గొల్లలవలస, ధీర్ఘాశి సచివాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కణితి సత్తిబాబు, మెండ కసుమాంజిలి, క్రిష్ణ రావు, ఎంపిటిసి ప్రతినిధి సూంపు జయరాం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు వజ్రా అవార్డు

ఇచ్ఛాపురం: ప్రజలకి నిస్వార్థంగా సేవలు అందించినందుకు ఫకీరు పేట సచివాలయం వాలంటీర్ ఎర్ర అప్పారావుకు వజ్రా అవార్డ్ రావడం అభినందనీయం అని వార్డ్ కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ యాదవ్ అన్నారు. నియోజికవర్గ స్థాయిలో ఈ అవార్డుకు అయిదుగురు ఎంపికకాగా ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో ఎర్ర అప్పారావు ఒకరు కావడం విశేషమని ప్రశంసించారు. ఈ సందర్భంగా సచివాలయంలో మంగళవార అవార్డు గ్రహీతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఊర్వశీ, అడ్మిన్ కనక రత్నం, ప్రదీప్ తది తరులు పాల్గొన్నారు.

అప్పారావును సన్మానిస్తున్న కౌన్సిలర్ దిలీప్

పాల్గొన్న విద్యార్థులు

సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

పొందూరు: విద్యార్థులు సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, దీనిద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపు సాధించాలని ఉపహార్ సంస్థ ఏరియా మేనేజర్ బి.ఎం.పాల్ అన్నారు. మండలంలోని లోలుగులోని ఉపహార్ స్వచ్ఛంద సంస్థలో యూత్ మీటింగ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఏసుదాసు, బోర్డు మెంబర్ నిర్మలారాణి, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు, సిబ్బంది ఉగాది, మోహన్, స్వాతి, మాలతి పాల్గొన్నారు.

పరమేశ్వరరెడ్డికి అభినందనలు

మెళియాపుట్టి : బసవ పరమేశ్వరరెడ్డిని జిల్లా టిడిపి బిసి రెడ్డిక సాధికార సమితి జిల్లా డైరెక్టర్‌గా నియమితులయ్యారు. జిల్లా డైరెక్టర్‌గా పదవికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈయన ఎంపికపై టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ, మహిళా జిల్లా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, భాస్కరరావు, వసంతు, చక్రి, శ్రీను పాల్గొన్నారు.

దళితులపై చిన్నచూపు తగదు

ప్రజాశక్తి - ఆమదాలవలస

దళితులంటే ప్రభుత్వానికి చిన్న చూపు అని టిడిపి మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావు అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 250 మంది దళితులపై దాడులు జరిగితే ఇంతవరకు కేసు నమోదు చేయలేదని అన్నారు. అలాగే శిరోమండనం కేసు లోనూ బాధితుడికి ఇంతవరకు ఎటువంటి న్యాయం జరగలేదని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 1970-71లో అప్పటి ప్రభుత్వం దళితులకు ఇచ్చిన డి పట్టా భూములకు రైతు భరోసా పథకం అందడం లేదని వాపోయారు. జిల్లాలో 20 వేల ఎకరాల డీ పట్టా భూములను జగనన్న కాలనీలకు ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదని మండిపడ్డారు. దళితులకు ఏదో మేలు చేస్తున్నట్లు ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఎస్‌సి కమిషన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు రూ.లక్షల కోట్లు నవరత్నాలకు మళ్లించి దళితుల నోట్లో మట్టి కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలేవి?

ఎఐవైఎఫ్ నాయకులు

మాట్లాడుతున్న ఎఐవైఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - నరసన్నపేట

జిల్లాలోని చాలా మండల కేంద్రాలలో మత్తు పదార్థాలు కార్యకలాపాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మంగళవారం మాట్లాడుతూ జిల్లాలో కొందరు గంజాయి, ఖైనీ వంటి మత్తు పదార్థాల వ్యాపార కార్యకలాపాలను ముమ్మరంగా కొనసాగిస్తున్నారని వాటి వలన అనేక మంది యువత చెడు వ్యసనాలకు గురై ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంతో పాటు అనేక మండల సరిహద్దుల్లో ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. వాటిపై పోలీస్, ఎక్సైజ్ డిపార్ట్మెంట్లు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న, వారికి సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాటిని అరికట్టడానికి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి యువత భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎన్ సాంబశివరాజు, ఎం.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ప్రజాశక్తి - పలాస

లింగ నిర్ధారణ నేరమని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినంగా చర్యలు తప్పవని ఆర్డీవో టి.సీతారామమూర్తి హెచ్చరించారు. ఆయన తన కార్యాలయంలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994 అమలు తీరుపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ ఎంపిక పద్ధతులను ఆడ మగ తెలుసుకోవడం నేరమన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లో బర్త్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అంగన్వాడి వైద్య సిబ్బంది సమన్వయంతో అబార్షన్ రక్తహీనతపై దష్టి పెట్టి పరీక్షలు జరపాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డిఓ ట్రైనింగ్ డాక్టర్ ఎంఎ అంబరీష్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, ఆర్డీవో సిబ్బంది ఎస్.కరుణమ్మ వి.సునంద విజయ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ కబ్జాలు అడ్డుకోవడంలో అధికారులు విఫలం

ప్రజాశక్తి - పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న భూకబ్జాలను అడ్డుకోవడంలో అధికారం విఫలమయ్యారని, భూ అక్రమదారులపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని నియోజకవర్గం జనసేన నాయకుడు డాక్టర్ దుర్గారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస జిలుగురు మెట్టను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెమలి నారాయణపురం పరిధిలో జాతీయ రహదారి అనుకుని ఉన్న జిలుగురు మెట్ట దాదాపు 1.56 ఎకరాల కొండ పోరంబోకు భూమి కబ్జాకు గురైనా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జీరాయతి స్థలంలో కలిపేసి ప్లాటులుగా వేసి అమ్మకానికి సిద్ధం చేశారన్న విషయం తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాదారులకు స్థానిక అధికారులు, వార్డ్ కౌన్సెల్లర్స్ అండదండలు పుష్కలంగా ఉండడం వల్లనే ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మంత్రి ఇటువంటి కబ్జాల పైన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. భూ ఆక్రమణలను నిలువరించక పోతే జనసేన పార్టీ తరపున ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు.

జిలుగురు మెట్టను పరిశీలించిన దుర్గారావు

జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా బాబూరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- పలాస

పలాస టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ వజ్జ బాబురావు నివాస గహంలో మంగళవారం వజ్జ బాబురావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబురావు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఆయనకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు అభిమానులు జన్మదిన శభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.చంద్రమౌళి, ఆర్ ప్రసాదరావు, జగదీష్ పండా తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న సర్పంచ్ గిరిజ

తాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రతిఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని గరుడుభద్ర సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వర్ రావు అన్నారు. మంగళవారం హరిజన పేటలో బోరు బావి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.700 కోట్లతో చేపడుతున్న ఇంటి ఇంటికి కొళాయి నీరు అందెంచే కార్యక్రమం శరవేగంగా జరుగుగోందన్నారు. ఈ కార్యక్రమంలో తారక్ కూర్మరావు, సిమ్మయ్య మహిళలు పాల్గొన్నారు.

తిరుమలలో చిన్న గురుస్వామి గాత్రం

ఇచ్ఛాపురం: వెంకటేశ్వర కళాబృందం ఇచ్ఛాపురం చిన్నాగురుస్వామికి అరుదైన అవకాశం లభించింది. ఆయన శ్రీవారి సన్నిధిలో భగవద్గీత శ్లోకాలు, అన్నమయ్య కీర్తనలు, ఘంటసాల మాస్టారు పాడిన భక్తి పాటలు పాడి భక్తులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైదరాబాద్ నేస్తం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు టిజి లింగం పాల్గొన్నారు. టిటిడి సభ్యులు వారిని సత్కరించారు.

అర్హులందరికీ పథకాలు

వీరఘట్టం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి విక్రాంత్ లు అన్నారు. సోమవారం మండలంలోని పనస నందివాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వారు మాడ్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాద యాత్రలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాంన్నారు. ఇప్పటికే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎవరైన అర్హత ఉండి పథకాలు అందకపోతే వెంటనే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఇంటింకటి వెళ్లి సంక్షేమ పథకాలు అందే తీరుపై ఆరా తీశారు. సర్పంచ్ బి సరోజినీ, ఎంపిపి డి వెంకటరమణ నాయుడు, జెడ్పిటిసి జంపు కన్నతల్లి, నాయకులు ఉమామహేశ్వరరావు, పివిఆర్ పురం, నీలా నగరం సర్పంచులు పి వెంకటరమణ, వావిలపల్లి పురుషోత్తమ నాయుడు, గంగ నాయుడు, సన్యాసినాయుడు, ఎంపిటిసి బి సూర్యప్రకాష్, పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఫిట్స్‌పై అవగాహన

సీతంపేట: స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రీఎక్లంప్సియా డేను సోమవారం సోమవారం సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు హైబిపి ఉన్నప్పుడు ఫిట్స్ రాకుండా ఉండడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో జాగ్రత్తలు గురించి తెలియజేశారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. గర్భిణులకు సూచనలు, సలహాలు తెలియజేశారు.

కొనసాగుతున్న వేసవి శిబిరాలు

క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- లావేరు

చిన్నతనం నుంచే చిత్రలేఖనం నేర్చుకోవాలని రిసోర్స్ పర్సన్ గంధం ఝూన్సీలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మురపాక శాఖాగ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 64 కలలో చిత్రలేఖనం ఒకటని, ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు నేర్చుకోవాలని అన్నారు. శ్రీరామ పట్టాభిషేకం, శివాజీ, గాంధీ, నెహ్రూ, తదితర బొమ్మలను చిత్రలేఖనం ద్వారా చూపించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

బలగ : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతో సహకరిస్తున్నాయని రిసోర్స్ పర్సన్ కె.ఆదిత్య అన్నారు. బలగ శాఖా గ్రంధాలయంలో గణితంలో చిన్న చిన్న మెలకువలు నేర్పించి వాటిపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను, సహాయకులు కె.అనిత, 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా 'సంక్షేమ' సంతోషం

సోంపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం నెలకొందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని కొర్లాంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల, మత రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్ఆర్సిపికే దక్కుతుందన్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ నర్తు

పథకాల గురించి వివరిస్తున్న సాయిరాజ్

రామారావు, సోంపేట, కంచిలి ఎంపిపిలు డాక్టర్ నిమ్మన దాసు, పైల దేవదాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా తాగునీటి సరఫరా

సిబ్బందికి సూచనలు ఇస్తున్న రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రజలకు అంతరాయం లేకుండా తాగునీరు సరఫర చేయాలని మున్సిపల్ ఛైర్పర్సన్ రాజ్యలక్ష్మి అధికారులకు ఆదేశించారు. ఇటీవల పాడయిన రెండు మోటార్లక మరమ్మతులు పూర్తిచేశారు. వాటి పనితీరును చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మీ మంగళవారం పరిశీలించి వివరాలను కమిషనర్ రమేష్‌ని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఏ అంతరాయం కలుగకుండా ఇకపై ప్రతీ రోజు తాగునీటి సరఫరా చేయడం జరుగుతుందని చైర్ పర్సన్ తెలిపారు. అనంతరం బహుదా నదిలో నిర్మించిన ఎర్తెన్ బండ్(నీటి అడ్డుకట్ట)ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బాగంగా ఇంచార్జి ఏఈ కామేశ్వరరావు, యర్రయ్య పాల్గున్నారు.

మీడియా స్వేచ్ఛను పరిరక్షించాలి

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

మీడియా స్వేచ్ఛను రక్షించాలని, జర్నలిస్టుల దాడులను అరికట్టాలని పాలకొండ ప్రెస్ క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ బుచ్చియ్యకు సోమవారం వినతి పత్రం అందించారు. హైదరాబాద్‌లో ఎబిఎన్ రిపోర్టర్‌పై దాడిని ఖండిస్తూ పాలకొండలో జర్నలిస్టులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకర్లు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులపై జరిగిన దాడిఘటనలో నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. విధినిర్వహణలో ఉన్న ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై, సిబ్బందిపై దాడిచేయడం పత్రికా స్వేచ్ఛపై దాడిగా, ప్రజల తెలుసుకునే హక్కుపై దాడి అన్నారు. హైదరాబాద్‌లో జర్నలిస్టులపై దాడికి బాధ్యులైనవారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. విజయనగరం జర్నలిస్టులపై సిఐడి పెట్టిన కేసును వెంటనే ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో పాలకొండ ప్రెస్‌క్లబ్ సభ్యులు సత్యనారాయణ, చంద్రరరావు, ఈశ్వరరావు, మండల నాయుడు, మన్మథ, ఎస్‌కె శివప్రసాద్, శంకరరావు, రాధాకృష్ణ, చంటి, నిరంజన్, కాంతారావు, బిసి నాయుడు, రాయి రామకృష్ణ,

నిరసన తెలుపుతున్న విలేకరులు

వెలమల రమణ, రవి, బాలరాజు, బండారి శివ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: కడప ఎంపి అవినాష్ రెడ్డి అనుచరులు జర్నలిస్టులపై దాడిని ఖండిస్తూ స్థానిక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన జర్నలిస్టులు సోమవారం మండల తహశీల్దార్ రామస్వామికి వినతిపత్రం అందజేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై వైసిపి ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి అనుచరులు దాడి చేయడం మీడియా స్వేచ్ఛ ని హరించడమేనని ప్రెస్ క్లబ్ నాయకులు బి.విశ్వేశ్వరరావు, జి.నాగేశ్వరరావు చెప్పారు. బాద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు రాము, గుప్తా, సీతారాం, కె.మోహనరావు, కె.సింహాద్రి, ఎల్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటరమణ

'మహానాడు'ను విజయవంతం చేయాలి

కొత్తూరు : ఈ నెల 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న టిడిపి మహానాడుకు తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పిలుపునిచ్చారు. స్థానిక కలమట కాంప్లెక్స్‌లో మంగళవారం పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు పి.మోహనరావు, ఎ.అరుణ్‌కుమార్, ఎల్.భగవాన్‌దాస్ నాయుడు, అచ్యుతరావు పాల్గొన్నారు.

నేడు ఎన్‌టిఆర్ శత జయంత్యుత్సవం

రామ్మోహన్

పొందూరు : పొందూరు పట్టుసాలి కళ్యాణ మండపంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంత్యుత్సవం టిడిపి జిల్లా అధ్యక్షులు కూన కూన రవికుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించినట్లు మండల పార్టీ అధ్యక్షులు చిగులిపల్లి రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముగ్గురు సీనియర్ కార్యకర్తలకు, ముగ్గురు నాట కరంగ కళాకారులకు సన్మానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొవాలని కోరారు.

సర్వేను ప్రారంభిస్తున్న కృష్ణంనాయుడు

జంగాలవలసలో భూ రీ సర్వే

బూర్జ : ప్రతి సెంటూ భూ రీ సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వైస్ ఎంపిపి కర్ణం కృష్ణంనాయుడు అన్నారు. మండలంలోని ఉప్పినివలస పంచాయతీ జంగాలవలసలో డ్రోన్ ద్వారా మంగళవారం భూ రీ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా డ్రోన్ కెమెరా ద్వారా సర్వే చేపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి వెంకట్ రమణ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత సార్లంగి

సీతంపేట: మండలంలోని సామరెల్లి -సీధి గ్రామంలో గ్రీన్ ఫీల్డ్ ప్రకాష్ స్టేడియంలో గత 43 రోజులగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో శ్రీకాకుళం జిల్లా సార్లంగి జట్టు విజేతగా నిలిచింది. ట్రోపి విజేతకు ప్రైజ్ మని రూ.30వేలు, రన్నర్‌గా నిలిచిన పార్వతీపురం మండలం కొండవాడ జట్టుకు రూ. 15వేలు నగదు బహుమతులను మన్య ప్రగతి చైర్మన్ గేదెల రవి చేతులు మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బిడ్డిక దమయంతి నాయుడు, మాజీ ఎంపిటిసి స్వర్ణలత, మాజీ ఉప సర్పంచ్, మన్య ప్రగతి అధ్యక్షులు గేదెల జనార్ధనరావు, జనరల్ సెక్రటరీ మీనక ఉమా మహేశ్వరరావు, బిడ్డిక జయప్రకాష్, మీనక కొండలరావు, టోర్నమెంట్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న గేదెల రవి, తదితరులు